www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 జనవరి 2024



జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ గుడిపాలలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్యసేవలు, ఉచిత మందుల సరఫరా, స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్యసేవలు, కంటి వైద్యసేవలు తప్పక నిర్వహించి ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించి, అత్యవసర కేసులను కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రతి అధికారి బాధ్యతతో నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



తాడో పేడో తేల్చుకుంటాం..

తగ్గేదే లే...

- అంగన్వాడీల పోరాటం ఉధృతం
- నేడు కలెక్టరేట్ ముట్టడి
- 22వ రోజు దున్నపోతుకు వినతులు ఇస్తూ నిరసన



పలమనేరులో..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 22 రోజులు పాటు శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు ప్రభుత్వంతో తాడోపేడో తెచ్చుకొనేందుకు సిద్ధమైయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు న్యాయమైన సమస్యలు పెట్టినా ప్రధాన డీమాండ్లు జీతాల పెంపు, గ్రాట్యుటీ అమలు విషయంతో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చింది. కలెక్టరేట్ ముట్టడికి జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నుండీ అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు సన్నర్థం అవుతున్నారు.

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం జీతాల పెంపు, గ్రాట్యుటీ చెల్లించాలంటున్నారు. మూడు యూనియన్ల పిలుపు మేరకు గతేడాది డిసెంబర్ 12వ తేది నుండీ రాష్ట్ర వ్యాప్తంగా విధులను బహిష్కరించి సమ్మెను కొనసాగిస్తున్నారు. వివిధ రూపాల్లో వినూత్న రీతిలో శాంతియుతంగా పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో మూడు దఫాలు చర్చలు జరిపినా ప్రధాన డిమాండ్ల జీతాలు పెంపు, గ్రాట్యుటీ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో అంగన్వాడీల సమ్మె కొనసాగుతోంది.

జీతం బెత్తెడు.. చాకిరి బారెడు..

స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా నడుస్తున్న అంగన్వాడీ సెంటర్లలో పనిచేస్తున్న వర్కర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవవేతనం పేరుతో ఇస్తున్న జీతం బెత్తెడు.. చారికీ బారెడుగా ఉంటోంది. సిఐటియు యూనియన్ ఏర్పాటు చేసుకున్న అంగన్వాడీలు రూ.2000ల వేతనం నుండీ పోరాటాల ద్వారా వర్కర్లు రూ.11,500 హెల్పర్ల రూ.7వేలకు జీతం పెంచుకున్నారు. ప్రభుత్వం అందించే జీతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పొచ్చుకుంటే ఏమాత్రం సరిపోదు. 2019 ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్షనేత, ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా తెలంగాణా కంటే అదనంగా వెయ్యి రూపాయులు జీతం పెంచి ఇస్తామని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జీతాలు పెంచి, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అంగన్వాడీలను అర్హులుగా ప్రకటించడంతో పాటు కొన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతున్నారు. అర్హత కలిగిన మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని కోరుతున్నారు.

సమ్మెను విచ్ఛినం చేసే ప్రయత్నం

సమస్యల సాధనకోసం వీరోచితంగా పోరాడుతున్న అంగన్వాడీల సమ్మెను విచ్ఛినం చేసేలా ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తోంది. అంగన్వాడీ సెంటర్లను బలవంతంగా తెరిపించడం, పోటీగా సచివాలయ సిబ్బందిని నియమిండం, ఐసిడిఎస్ అధికార్ల ద్వారా బెదిరింపులకు పాల్పొడుతోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అంగన్వాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. కలెక్టరేట్ ముట్టడిని భగ్నం చేసేలా ఈనెల 5వ తేదీలోపుగా విధులకు హాజరుకాకుంటే విధుల నుండీ లొలగిస్తామంటూ అల్మిమేటం జారీచేసింది. ఐదేళ్ళపాటు జగన్ ఇచ్చిన మాటప్రకారం జీతాలు పెంచుతారని ఆశించిన అంగన్వాడీలు ఐదేళ్ళ తరువాత ప్రత్యక్ష పోరాటానికి పూనుకున్నారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు పూనుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఎంత నిర్భందించాలని ప్రయత్నించినా కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలనే దృఢనిచ్ఛయంతో జిల్లా వ్యాప్తంగా కదులుతున్నారు.

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలను పరిష్కరించడంలో ఆలస్యం అవుతున్న సందర్భంగా జనవరి 3వ తేదీ జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు షకీలా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని యాదమరి తహశీల్దార్ కార్యాలయం ముందు సమ్మె 22వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సమస్యలు పరిష్కారం కాకుండా సమ్మె విరమించేది లేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తమ డిమాండ్ పరిష్కరించాలని దున్నపోతుకు వినతి సమర్పించిన వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బైరెడ్డిపల్లి ప్రాజెక్ట్ అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు జిల్లా వ్యవసాయ కార్మిక సభ్యులు ఓబుల్ రాజ్ సమ్మెకు మద్దతు ప్రకటించారు. నేడు జరుగనున్న కలెక్టరేట్ ముట్టిడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పలమనేరు: నియోజకవర్గంలో అంగన్వాడీ వర్కర్స్ 22వ రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ తమ వినతిపత్రాన్ని ఒక దున్నపోతుకు సమర్పించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్రను వదిలి తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని విన్నవించారు.



బైరెడ్డిపల్లిలో..

డిప్యూటీ సీఎంను అడ్డగించిన అంగన్వాడీలు



అంగన్వాడీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి

కార్వేటినగరం: గత 22 రోజులుగా తమ సమస్యల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మంగళవారం కార్వేటి నగరం జాతీయ రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ప్రయాణిస్తున్న కాన్వాయి అడ్డుకున్నారు. దీంతో ఉపముఖ్యమంత్రి కారు దిగివచ్చి అంగన్వాడీల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ సంఘ నాయకులు ఉపముఖ్యమంత్రికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. గత 22 రోజులుగా తాము సమ్మె చేస్తున్న ప్రభుత్వం చర్చలకు పిలువకపోవడం, పట్టించుకోకపోవడం దారుణమని సిఐటియు కార్యదర్శి మమత, ఏఐటియుసి రాధమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీ రంగరాజపురం, మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా

వసతులపై నివేదిక సిద్ధం చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో1762 పోలింగ్ కేంద్రాలలో ఉన్న వసతులపై పూర్తి నివేదికను సిద్ధం చేసి అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో కనీస వసతుల ఏర్పాటు, మరియు పిఓ, ఎపిఓ, మైక్రో అబ్జర్వర్ల నియామక ప్రక్రియకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్‌కేంద్రంలో అవసరమైన ఫర్నిచర్, విద్యుదీకరణ, టాయిలెట్ సౌకర్యం, ర్యాంపుల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి పోలింగ్‌కేంద్రాల వారీగా ప్రస్తుతం ఉన్న వసతులపై నివేదికను సిద్ధం చేసి ఈనెల 5వ తేదీ లోపు నివేదికను అందజేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పిఓలు, ఏపిఓలు, మైక్రో అబ్జర్వర్లు సెక్టోరియల్ అధికారులు నియామకం కొరకు సంబంధిత శాఖలో అధికారులు సిబ్బంది వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. మైక్రోఅబ్జర్వర్ల నియామకంలో వివిధ బ్యాంకుల, ఇన్సూరెన్స్ సంస్థలు పోస్టాఫీస్ నుండి వివరాలను అందజేయాలన్నారు. అధికారి, సిబ్బంది వివరాలు ఇచ్చిన నివేదికను పూర్తిగా పూరించి అందజేయాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జెడ్పి సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవానీ, డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపిసి వెంకట రమణారెడ్డి, డివిఈఓ సయ్యద్ మౌలా, డిఎల్‌డిఓ రవికుమార్, చిత్తూరు కమిషనర్ అరుణ, చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సుజన, ఐసిఓఎల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ బ్యూలా, పుంగనూరు, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు నరసింహ ప్రసాద్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి కనీస వసతులపై నివేదిక సమర్పించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కమిషనర్ నగరపాలక కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరపాలక పరిధిలోని మొత్తం 150పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించాలన్నారు. అలాగే విద్యుదీకరణ, నీటి సరఫరా, ఫర్నిచర్, మరుగుదొడ్లు, ర్యాంపు నిర్మాణంపై నివేదిక ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇంకా ఏమైనా పనులు చేయాలో తెలుపుతూ నివేదిక సమర్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన కోసం అధికారులను బందాలుగా ఏర్పాటు చేశారు. నగరపాలక పరిధిలో నేటి నుంచి నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణపై కమిషనర్ అరుణ నగర పాలక అధికారులు, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన షెడ్యూల్ వారీగా క్యాంపుల నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. క్యాంపులకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు ముందస్తుగా పూర్తి చేయాలని, కౌంటర్ల ఏర్పాటు నిర్వహణ పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే పూర్తిచేసేలా పర్యవేక్షించాలన్నారు. క్యాంపు రోజున నిర్దేశించిన విభాగాల వైద్యులు హాజరయ్యేలా సమన్వయం చేయాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఏసిపీ రామకష్ణుడు, సీఎంఎం గోపి, ఆర్వో గోపాలకష్ణ వర్మ, డీఈలు, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిపై 25న మాక్ పోల్ నిర్వహణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలింగ్ సరళిపై అవగాహన నిమిత్తం పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఈనెల 25న మాక్‌పోల్ నిర్వహణ చేపట్టాలని విద్యాశాఖ, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ స్వీప్ యాక్టివిటీస్ నిమిత్తం వివిధ శాఖల వారీగా చేపట్టవలసిన కార్యక్రమాల నిమిత్తం సంబంధిత అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పోలింగ్ స్టేషన్‌వారీగా స్వీప్ ఆక్టివిటీస్‌ను బిఎల్‌ఓ నిర్వహించాలన్నారు. ఓటుహక్కు నమోదు ప్రక్రియ, ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా మరణించిన వారి పేర్లను తొలగించే విషయంపై సంబంధిత పంచాయతీ సెక్రటరీలతో సమన్వయం చేసుకొని ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఆశా, స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా ఓటు హక్కు వినియోగంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలింగ్ స్టేషన్లో వారీగా అక్షరాస్యత తక్కువగా ఉన్న చోట కూడా ఓటర్లు గా వున్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీనితోపాటు ఎన్నికల పోలింగ్ సరళిపై అవగాహన నిమిత్తం పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఈనెల 25న మాక్ పోల్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ, ఇంటర్మీడియట్ అధికారులు డీఈఓ విజయేంద్ర రావు, డివిఈఓ సయ్యద్ మౌలాలను కలెక్టర్ ఆదేశించారు. కళాశాల స్థాయిలో ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్బులు ఏర్పాటు ద్వారా యువఓటర్ల నమోదు ప్రక్రియ, ఓటుహక్కు వినియోగంపై అవగాహన పెంచాలన్నారు. స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా శాఖల వారీగా డ్వామా, ఐసిడిఎస్, డీఈఓ, జడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్లు వారు చేయబోయే కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్. రాజశేఖర్, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా, మెప్మా పీడీలు గంగాభవాని, రాధమ్మ, డిపిఓ లక్ష్మి, ఐసిడిఎస్ పిడి నాగ శైలజా, డిఎల్‌డిఓ రవికుమార్, చిత్తూరు కమిషనర్ అరుణ, చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సుజన, ఐసిఓఎల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, పుంగనూరు, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు నరసింహ ప్రసాద్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాక్‌పోల్ నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రైతు ఇంటిపై ఏనుగుల దాడి

- పశువులపై దాడి, అరటి తోట ధ్వంసం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన రైతు ఇల్లు

ప్రజాశక్తి- గంగవరం

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కేసుపెంట గ్రామంలో మంగళవారం ఉదయం 5గంటలకు ఏనుగులు గుంపు ఊరి పొలిమేర్లులోని రైతు రఘునాథ్ ఇంటిని పూర్తిగా ధ్వంసం చేశాయి. దీంతో భయబ్రాంతులకు గురైన ఇంటిలోని కుటుంబ సభ్యులు పరుగులు తీశారు. అనంతరం పక్కనే ఉన్న గడ్డివామి వద్ద ఉన్న పశువులను సమ్మితం తొక్కి గాయపరిచాయి. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ తెల్లవారు జామున పెద్ద శబ్దం రావడంతో కిటికీలోనుంచి చూడగా ఏనుగులు కనిపించాయని వెంటనే ఓ మూలన శబ్దం చేయకుండా వాటికి కనిపించకుండా కూర్చోవడంతో అవి ఇంటిని ధ్వంసం చేసి గడ్డివాము వైపు వెళ్లగానే గ్రామంలోకి పరుగుతీశామని తెలిపారు. ఇప్పటి వరకు ఏనుగులు పంటపొలాలపైనే దాడులు చేసి అడవిలోకి వెళ్లేవని ఇప్పుడు గ్రామంలోకి వచ్చిన తన ఇంటిపై దాడి చేయడమే కాకుండా పశువులను గాయపరిచాయని వాపోయాడు. అంతేకాకుండా పక్కనే ఉన్న అరటి పంటను తిని తొక్కి నాశనం చేశాయని, అటవీ శాఖ, ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

హామీలకు 'ఉరి'

- 14వ రోజూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె
- సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగించాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు పిలుపు



ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న నరసింహారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె రాష్ట్రవ్యాప్తంగా 14వ రోజు కొనసాగింది. మంగళవారం చిత్తూరు కలెక్టరేట్ శిబిరం వద్ద భారీగా ఉద్యోగులు మెడకు ఉరి వేసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలు గడిచినా విద్యాశాఖలో పనిచేసే సమగ్ర శిక్ష ఉద్యోగులను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని అన్నారు. విద్య కార్యక్రమాలు నిర్వహించడంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు కీలకపాత్ర వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కష్టజీవుల సమస్యలను పట్టించుకోవడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. 18 విభాగాల్లో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు పని ప్రాధాన్యత ఎక్కువగా ఉందని వారి సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు ధైర్యంగా ఐక్యంగా పోరాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహవరించకుండా కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే వీరి పోరాటానికి అన్ని ప్రజాసంఘాలు మద్దతు కూడగడతామని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మెను కొనసాగించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘ నాయకులు శ్రీనివాసులు, వేలాయుధం, నారాయణ, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



మారుతున్న రాజకీయ సమీకరణలు

చిత్తూరు, పూతలపట్టులో కొత్త వారికి అవకాశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సమయం దగ్గరపడుతున్న కొద్దీ చిత్తూరు అసెంబ్లీ రాజకీయం వేడెక్కుతోంది... రాజకీయ సమీకరణలు మారుతున్నాయి... చిత్తూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ స్థానం కోసం అధినేత జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని ఆశిస్తున్న ఎపిఎస్ ఆర్‌టిసి వైఎస్ ఛైర్మెన్ విజయానందరెడ్డి, సిట్టింగ్ ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎంపి డికె ఆదికేశవులు నాయుడు తనయుడు డిఏ శ్రీనివాస్‌లను రాష్ట్ర రాజధానికి మంగళవారం రమ్మటూ ఆహ్వానించి చర్చలు జరిపారు. సిట్టింగ్ ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులుకు సర్వే పాజిటీగా రాకపోవడతో చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంసి విజయానందరెడ్డిని నియమించిన్నట్లు సమాచారం. ఇక ఎంసి విజయానందరెడ్డికి చిత్తూరు టికెట్ కన్ఫాం అయిన్నట్లు వార్తలు రావడంతో విజయానందరెడ్డి అభిమానులు సంబరాలు జరుకున్నారు. తనకే మరోసారి చిత్తూరు స్థానాన్ని కేటాయిస్తారని ఆశించిన సిట్టింగ్ ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిని డిఏ శ్రీనివాస్ కలవడంతో డిఏ శ్రీనివాస్ టిడిపి నా వైసిపి నా అనే చర్చకు తెరపడింది. డిఏ శ్రీనివాస్ వైసిపిలో చేరిన్నట్లు సమాచారం.

సిఎం పై ఎంఎస్ బాబా ఘాటు విమర్శలు

రాష్ట్ర ముఖ్యమంత్రిపై పూతలపట్టు సిట్టింగ్ ఎంఎల్ఏ ఎంఎస్ బాబు ఘాటైన విమర్శలు చేశారు. ఐదేళ్లపాటు వైఎస్సార్‌సీపీ అగ్రనేతల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రజాసేవ చేశానని, ఐప్యాకె సర్వే తనకు అనుకూలంగా రాకపోవడంపై తనను బలి చేయడం ఏమిటని ప్రశ్నించారు. పార్టీ కార్యాక్రమాలు నియోజవర్గంలో శక్తికి మించి చేశానని, ఐప్యాకెస్ సర్వే బూటకమని డబ్బులిచ్చే వారికి అనుకూలంగా ఇస్తున్న తీవ్ర ఆరోపనలు చేశారు. పార్టీలో టికెట్ల కేటాయింపులో దళితులకు తీవ్రఅన్యాయం జరుగుతోందన్నారు.



ఎంసి విజయానందరెడ్డి



డిఏ శ్రీనివాస్

ఎట్టి పరిస్థితుల్లో పార్టీని విడబోనని స్పష్టం చేశారు. చిత్తూరులో తన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎస్ బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా తనకు ఫోన్ చేసి ఈసారి పూతలపట్టు నియోజవర్గ టికెట్‌ను ఆశించవద్దు అని చెప్పడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఎమ్మెస్. బాబు పూతలపట్టు ఎమ్మెల్యే

నేడు ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట వంటావార్పుతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా కార్యదర్శి సరిత తెలిపారు. మంగళవారం నిరసన కార్యక్రమానికి సంబంధించి ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'జయహో బీసీ'

విజయవంతం చేయండి : శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గుంటూరు జిల్లా మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఈ నెల 4న నిర్వహించబోయే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన గంగాధర నెల్లూరులో మాట్లాడారు. పెద్ద ఎత్తున బీసీలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మండల బీసీ సెల్ అధ్యక్షులు జ్యోతి యాదవ్ కోరారు.

పండుగలా పింఛన్ల పంపిణీ : ఎంపీపీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు అందిస్తామని ఎంపీపీ రెడ్డెప్ప అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం మండల కేంద్రంలో జరగబోయే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని వివరించారు. నాయకులు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద వెలగటూరు ఎంపీటీసీ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌కి

జెడ్పీ చైర్మన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వి.కోట: వికోట మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ అక్బర్ జన్మదిన వేడుకల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. మంగళవారం అభిమానుల మధ్య కేక్‌కట్ చేసి ఉపసర్పంచ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఎవర్జీయా లైఫ్ సైన్సెస్ ట్రస్ట్ ద్వారా పేదలకు దుప్పట్లు, చీరలు, దోవతిలు ఆ ట్రస్ట్ అధినేత రాజీవ్ చంద్రబోస్, నవీన్ ఆధ్వర్యంలో అందజేశారు. మండలంలోని కటికపల్లి పంచాయతీలో సుమారు 300మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి సీఎంసీ చీలాపల్లి డాక్టర్ జీవరత్నం దంపతులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఎవర్జీయా లైఫ్ సైన్సెస్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వేలూరు సిఎంసి పాస్టర్ రెవరెండ్ విజయకుమార్, కొత్తపల్లి గుడి మండలం పాస్టర్ రెవరెండ్ ఆబెల్ ప్రభు, శ్రీకాళహస్తి పాస్టర్ రెవరెండ్ వినోద్ కుమార్, ముఖ్య అతిథి సీఎంసీ చీలాపల్లి డాక్టర్ జీవరత్నం దంపతులు, రాజీవ్ చంద్రబోస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడాసామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-నగరి: ఇటీవల నిర్వహించిన జోనల్ క్రీడల్లో మండలంలోని నాగరాజకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అన్ని క్రీడల్లోను చురుగ్గా పాల్గొని పాఠశాలను మొదటి స్థానంలో నిలిపారు. విద్యార్థులకు ప్రోత్సాహంగా ఉపాధ్యాయులంతా కలిసి రూ.25వేలు పోగుచేసి వారికి అవసరమైన క్రీడా సామగ్రి కొనుగోలు చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మోహన్ రామ్, పురుషోత్తమాచారి, పీడీ చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఖరారు.. వైసీపీ సంబరాలు



వైసీపీ నేతల సంబరాలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: నెల్లూరు డివిజన్ ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసి విజయానందరెడ్డికి చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఖరారు కావడంపై శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్వగ్రామం ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లిమిట్టలో భారీగా టపాసులు పేల్చి, కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యుగంధర్, సామి సుధాకర్‌రెడ్డి, గోవిందరెడ్డి, చంద్రారెడ్డి, ఆబురయ్య మాధవ, దొర వేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రజాశక్తి 2024 క్యాలెండర్‌ను చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు తన నివాసం లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎడిషన్ మేనేజర్ సిఎస్ ప్రసాద్, డివిజన్ ఇన్‌ఛార్జ్ దాము, విలేకరి బాల సుబ్రమణ్యం, ఫోటో గ్రాఫర్ సురేంద్రరెడ్డిలు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యాదమరి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో శివాజీ, ఎంఈవో రుక్మిణి చేతుల మీదుగా మంగళవారం ఎస్టీయూ నాయకులు క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు గుణశేఖర్, ప్రధాన కార్యదర్శి రమేష్, గౌరవ అధ్యక్షులు బాషా, మదన్‌మోహన్ రెడ్డి, గణపతి, ఓబుల్ రెడ్డి, సుబ్రమణ్యం పిల్లై తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: ఎంఈవో లీలారాణికి మంగళవారం ఎస్‌టీయూ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఆర్థిక కార్యదర్శి వెంకటయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షులు రజాక్, మహిళా కన్వీనర్ రమారాణి, మణి, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి: జేసీ



రేషన్ పంపిణీపై ఆరాదీస్తున్న జేసీ

ప్రజాశక్తి - యాదమరి: ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బ ందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళవారం యాదమ రి మండలంలోని మాదిరెడ్డిపల్లెలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధి కారులకు పలు సూచనలు చేశారు. నిత్యావసర సరుకుల నెలనెలా పంపిణీపై కార్డుదా రులను ఆరా తీశా రు. ప్రభుత్వం ఇస్తున్న సరుకులు సరిపోతు న్నాయా అని ప్రశ్నిం చారు. ఎండియూ వాహనాల ద్వా రా పంపిణీలో ఎటువంటి సమస్య లు తలెత్తకుండా తహశీల్దారు పర్య వేక్షణ చేయాలన్నారు. జెసి వెంట తహశీల్దారు హనుమంత నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వో రేఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పారిశుద్ధ్య పర్మినెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలో జాప్యం నిర్లక్ష్యం వహిచింనందుకు వ్యతిరేకంగా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3వ తేదీ నుండి నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు ఏఐటియుసి నగర కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి తెలిపారు. మంగళవారం ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తున్నందని అన్నారు. ప్రభుత్వం మున్సిపల్ పారిశుద్ధ్యం పర్మనెంట్ కార్మికుల, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్, ఇంజనీర్ విభాగం, క్లాప్ ఆటోడ్రైవర్లు సమస్యలను పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. నాయకులు కే.మణి, దాసరి చంద్ర, కే.రమాదేవి, పి.రఘు, గజేంద్రబాబు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

అవ్వాతాతల ముఖంలో ఆనందం : డిప్యూటీ సిఎం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాష్ట్ర ప్రజలకు అన్నగా, మేనమామగా, కొడుకుగా, మనవడిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని డిప్యూటీ సిఎం, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణ స్వామి అన్నారు. మంగళవారం గంగాధర నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ల కానుకలో భాగంగా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ సిఎం ప్రారంభించారు. ఈసందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు అభివద్ధి చేయడం జరిగిందన్నారు. అట్టడుగువర్గాల వారికి రాజకీయంగా స్థానాలను కల్పించారన్నారు. పేదరికంగా అర్హతగా నిర్ణయించి అగ్రవర్ణాల పేదలకు కూడా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్వేటినగరంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించుకున్నామన్నారు. భవిష్యత్తులో పేదవారికి అవసరమైన మరిన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. డిఆర్డిఏ పిడి తులసి మాట్లాడుతూ ప్రభుత్వం ఇది వరకు అందిస్తున్న సామాజిక పింఛన్ రూ.2,750ల నుంచి రూ.3,000లకు పెంచడం జరిగిందని, జనవరి 2 నుండి ఈ ఆర్థిక సహాయంను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. ఎంపీపీ లత బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఉపాధ్యక్షులు మణమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీవో మోహన్ మురళి, తహశీల్దార్ రవికుమార్, మండల కన్వీనర్ శేఖర్‌రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యం : డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ముద్దికుప్పం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. నోడల్ ఆఫీసర్ సునీల్‌కుమార్, సర్పంచ్ గిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చిత్తూరు డిఎంహెచ్‌వో ప్రభావతి, డాక్టర్ రవి రాజు, జెడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్లు గిరి, సందీప్ రాజ్ పాల్గొన్నారు.

సదుం: మొరవ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు డాక్టర్ చరణ్ విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్నాథం, ఎంపిటిసి మల్లికార్జున, డాక్టర్లు అనురాధ, శ్రీనివాస్, చరణ్ పాల్గొన్నారు.

రామకుప్పం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని బందార్లపల్లి సర్పంచ్ రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 238మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకృష్ణ, మాజీ సింగిల్ విండో చైర్మన్ సుగునప్ప, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం ఉదయం అగరమంగళం సచివాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, సిహెచ్ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష పేస్-2లో భాగంగా మంగళవారం నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ రెడ్డెప్ప, జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు, డిసిసిబి చైర్మన్ రెడ్డెమ్మ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశు, నాయకులు కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యాదమరి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడతలో భాగంగా యాదమరి, దాసరపల్లి సచివాలయ పరిధిలో ప్రారంభించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి ప్రభావతి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-వి.కోట: యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయ ప్రాంగణంలో ఎంఈఓ చంద్ర శేఖర్ చేతుల మీదుగా పెద్ద ఎత్తున యుటిఎఫ్ ఉపాధ్యాయ బృందం క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి.రమణ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం సమైక్యంగా అనేక పోరాటాలతో సమస్యలను పరిష్కరించుకున్నామని రాబోవు కాలంలో కూడా ఉపాధ్యాయుల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి ముందుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దక్షిణామూర్తి, మండల గౌరవ అధ్యక్షులు యంసి నిర్మల, అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యాయులు బిర్లా నాయుడు, గజేంద్రరావు, మణి తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



ప్రచారంలో మురళిమోహన్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమ వుతుందని టీడీపీ పూతలపట్టు ఇన్‌ఛార్జ్ మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని మొగిలి, గాండ్లపల్లి గ్రామాల్లో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌గౌడ్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, నాయకులు భాష్యం వంశిచౌదరి, మంజు, కోదండ, శివ, రాధిక, శంకర్, ధనంజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన జీజెఎం ట్రస్ట్ అధినేత



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను జీజెఎం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్‌మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కైగల్ కనువిందు





దట్టమైన అటవీ ప్రాంతం.. నడుమ జాలువారే జలపాతం.. పచ్చటి ప్రకృతి సౌందర్యం.. వినసొంపైన పక్షుల కిలకిలరావాలు.. జలజల పారుతున్న సేలయేటి చప్పుళ్లు.. ప్రకృతి ప్రేమికులను రారమ్మని పిలుస్తోంది కైగల్ జలపాతం. బైరెడ్డిపల్లి-వికోట మార్గ మధ్యలో ఈ కనివిందు ఆకర్షిస్తోంది. ☞ ప్రజాశక్తి-పలమనేరు

పశువులన్నింటికీ టీకాలు

వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు



గాలికుంటు వ్యాధి టీకాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, చిత్తూరు: పశువులలో వచ్చే గాలి కుంటువ్యాధి వ్యాప్తి చెందకుండా వేసే టీకాలు క్షేత్రస్థాయిలో వేయడం జరుగుతుందని అందరూ తమ తమ పశువులకు ఈవ్యాక్సిన్ వేయించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో వేసే 32వ విడత గాలి కుంటువ్యాధి టీకా కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఛాంబర్‌లో వాక్సిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతన్నలు పాడి పశువులపై ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నారనీ జిల్లాలో మొత్తం 5.3 లక్షల పశువులు ఉన్నాయనీ, రైతులను ప్రధాన ఆదాయంగా ఉంటుందని అన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ పశువులకు ఎటువంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలన్నారు. జిల్లాకు మొత్తం 4.91లక్షల డోసులు రావడం జరిగిందని పాడి రైతులు అందరూ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మణాళిని, డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యావసాయాభివృద్ధికి రుణాలు ఇవ్వండి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, చిత్తూరు: ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించేందుకు బ్యాంకర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించాలని, వివిధ పథకాల ద్వారా అందిస్తున్న రుణాలకు సంబంధించి లబ్ధిదారుల గుర్తించడంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న, మధ్యతరహ పరిశ్రమల అభివద్ధికి మరింతగా దోహదపడాలని గ్రామీణస్థాయిలో బ్యాంకింగ్ సేవలు మరింతగా పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఇటీవల మూడు నెలలుగా బ్యాంకులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వార్షిక నివేదికలో మూడు నెలలకు సంబంధించి ఇచ్చిన ప్రగతిలో మరింతగా పెంపొందించు కోవాలన్నారు. ప్రయారిటీ సెక్టార్లకు ఇస్తున్న రుణాలను మరింతగా పెంచాలన్నారు. బ్యాంకులకు సంబంధించి ఎన్‌పిఎల వివరాలుంటే తెలపాలని ఎటువంటి పరిస్థితుల్లో ఈవిధంగా లేకుండా చూసేందుకు ప్రభుత్వ అధికారులు సహకరిస్తారని అన్నారు. వైయస్సార్ క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ కు సంబంధించి సహకరిస్తున్నామని బ్యాంకర్లు తెలపగా అన్ని రకాల బీమా సౌకర్యం కల్పించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని క్షేత్రస్థాయిలో ఖాతాదారులకు రుణాలు అవసరమైతే గ్రామాలకు వెళ్లి వారి సంబంధించిన వివరాలు సేకరించి ఎలా చూడాలన్నారు. వీకర్ సెక్షన్లకు సంబంధించిన రుణాల విషయంలో మరింతగా ఇవ్వాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇస్తున్న రుణాల విషయంలో అధికారులు సంతప్తి వ్యక్తం చేశారు. డైరీలు ఫిషరీస్ పశుసంవర్ధక శాఖలకు సంబంధించి ఇచ్చే రుణాలను మరింతగా పెంచాలని తద్వారా ప్రజలలో ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకర్లు స్కిల్ డెవలప్మెంట్‌కు సంబంధించి మరింతగా శిక్షణను ఇవ్వాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాటా డుతూ రుణాలకు సంబంధించి వివరాలను తెలిపారు. ఈసందర్భంగా వివిధ పథకాలకు సంబంధించి రుణాలను అందించడంలో వివిధ బ్యాంకులు చేస్తున్న సేవలను వివరించారు. సమావేశంలో ఆర్బిఐ ప్రతినిధి నాగప్రవీణ్, నాబార్డ్ డీడీఎం సునీల్, ఇండియన్ బ్యాంక్ డిజెడ్ ఎం.రాజేష్, బ్యాంకర్లు డిఆర్డిఏ తులసి, మెప్మా అధికారిని లక్ష్మి, పశుసంవర్ధకశాఖ జేడి ప్రభాకర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ అధికారి మురళీకష్ణ, ఫిషరీస్ డిడి రవికుమార్, జిఎండిఐసి ప్రభాకర్ పాల్గొన్నారు.

అవసరాలను చర్చిద్దాం.. అభివృద్ధికి తోడ్పడదాం..

- అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు



ప్రజాశక్తి-సోమల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు న్విహించారు. ప్రతి ఏటా జనవరి 2న ఆనవాయితీగా గ్రామ సభలు నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల వద్ద నుంచి గ్రామ అభివృద్ధి పనులకు సంబందించి చర్చించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయా పంచాయతీ సర్పంచ్‌లు వివరించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రజలు గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వెనువెంటనే పరిష్కరిస్తామని సర్పంచ్‌లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరం.. ఏంటి అంతరంగం!

- ఆగిన అంబేద్కర్ భవన నిర్మాణంపై దళిత సంఘాల ఆందోళన
- పనులు పూర్తి చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-వి.కోట : వికోట మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో దళిత నాయకులు నిరసనకు దిగారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పాలకుల అలసత్వాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దళిత నేతలు సామూహిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తెదేపా పాలనలో అంబేద్కర్ భవనానికి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 28 సెంట్లు స్థలాన్ని గత ప్రభుత్వం కేటాయించింది. ఆగమేఘాలపై భవన నిర్మాణ పనులను ప్రారంభించింది. గుత్తేదారు పునాదులు వేశారు. పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చినా పాలకులు అంబేద్కర్ భవన నిర్మాణ పనులు ఊసెత్తిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నర ఏళ్ల గడిచిపోయాయి. అంబేద్కర్ భవన నిర్మాణ పనులపై సమీక్షించి గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితోనే పనులు ఆగిపోయాయని నాయకులు చెప్పడాన్ని వారు తప్పు పట్టారు. ప్రతి మూడు నెలలకోసారి జరుగుతున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో దళిత సంఘాల నేతలు ముక్తకంఠంతో భవన నిర్మాణం చేపట్టాలని పాలకులు, అధికారుల దృష్టికి తీసుకురాగ అన్ని పరిశీలించి ఎన్నికల అనంతరం పనులు చేపడతామని ఎంపీపీ హామీ ఇచ్చారని అది ఎన్నికల హామీగా మిగిలిపోతుందన్న అనుమానాన్ని వారు వ్యక్తం చేశారు. మండలంలో సుమారు 22వేలకు పైగా దళిత ప్రజల ఓట్లు ఉన్నాయన్న విషయాన్ని అధికార ప్రతిపక్ష పార్టీలు గుర్తించాలని హెచ్చరించారు. దళిత నేతలు శివరాం గణపతి, వినోద్, విశ్వనాథ్, గిరి, సుబ్రహ్మణ్యం, శంకర్రావు, గుణ, గుర్రప్ప, సురేంద్ర, తంగరాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా స్వాధీనం



నాటుసారా స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి-సదుం: నాటు సారా స్థావరంపై దాడి చేసి 10లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మారుతి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అందిన రహస్య సమాచారం మేరకు మండలంలోని మొరవపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గాదేవారిపల్లి సమీప ప్రాంతంలో దాడులు నిర్వహించామన్నారు. తమ రాకను గుర్తించిన సారా కాస్తున్న వ్యక్తి పరార్ అయినట్లు చెప్పారు. సంఘటనా స్థలంలో 1600లీటర్లు ఊటను ధ్వంసం చేసి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది అమర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి-చౌడేపల్లి: గడ్డివామి దగ్ధమై రూ.20వేల వరకు ఆస్తి నష్టం సంభవించిన సంఘటన చౌడేపల్లిలో చోటుచేసుకుంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు.. మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లి వెంకటరమణకు గ్రామంలో గడ్డివామి ఉంది. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి బీడీ ముక్కలు గడ్డివామీపై పడేశారు. దీంతో మంటలు చెలరేగాయి. గుర్తించిన చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అంతలోనే సమాచారం అందుకున్న పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది సుబ్రహ్మణ్యం, సుమన్, ఇమ్మానుయేల్, కేశవులు అక్కడకు చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ మంటల్లో దాదాపు రూ.20వేల వరకు ఆస్తి నష్టం సంభవించిందని సుబ్బరాజు తెలిపారు.

ముసుగు దొంగ హల్‌చల్



చోరీకి పాల్పడుతున్న దొంగ (సీసీ పుటేజ్)

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఎస్ఆర్ పురంలో పెట్రోల్ బంక్‌లో ముసుగు దొంగ హల్ చల్ చేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. ఎస్ఐ షేక్షావలి కథనం మేరకు.. మండల కేంద్రంలోని చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో సోమవారం రాత్రి గుర్తుతెలియని ముసుగు దొంగ చొరబడి పెట్రోల్ బంక్ సిబ్బంది నిద్రిస్తుండగా వారిని లాక్ చేసి కౌంటర్లో ఉన్న రూ.2లక్షల 40వేలను అపహరించాడు. అనంతరం ముద్దుకుప్పం చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి లక్ష్మీపురం సర్కిల్ వద్ద ఉన్న నయరా పెట్రోల్ బంక్ వద్ద వెళ్లి చోరీకి పాల్పడేందుకు ఆఫీస్ తలుపులు పగలకొట్టడానికి ప్రయత్నం చేశాడు. ఎంతసేపటికి తలుపులు రాకపోవడంతో వెనుతిరిగాడు. ఇండియన్ పెట్రోల్ బంక్ యజమాని గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఏపీ ఎన్‌జీవో నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ షన్మోహన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాలెండర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కెవి.రాఘవులు, సెక్రటరీ విజి.రఘు, అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, మహేష్, రమేష్ చిత్తూరు తాలూకా అధ్యక్షులు భాను ప్రకాష్, గురునాథం, సుభాన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.